క్లుప్తంగా

'ఉపాధి' పనులను వినియోగించుకోండి



రాయపర్తి (వర్ధన్నపేట) : ఉపాధి హామీ పనులను గ్రామీణ పేదలు వినియోగించుకోవాలని ఏపీఓ నగేశ్ కోరారు. వర్ధన్నపేట మండలంలోని కడారిగూడెంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం ఆయన సందర్శించి మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న పనులను కూలీలు వినియోగించుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు.

రేపు రాజకీయ శిక్షణ తరగతులు

నర్సంపేట : మండలంలోని మహేశ్వరంలో రేపు (30)న సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గడ్డం సదానందం తెలిపారు. పట్టణంలో డివిజన్ సహాయ కార్యదర్శి అడ్డూరి రాజు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 2024లోనే స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేసి రెండింతల ఆదాయం తెచ్చి పెడతామని హామీ ఇచ్చి రైతులను మోసం చేసిందని విమర్శించారు. రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి సూరి, జిల్లా కమిటీ సభ్యులు మైదం పాణి పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

పర్వతగిరి : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రేపు (30)న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు, అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

కోళ్లఫాం నిర్మాణాన్ని నిలిపేయాలని వినతి




రాయపర్తి : మండలంలోని పన్యానాయక్‌తండా సమీపంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన కోళ్లఫాం నిర్మాణాన్ని నిలిపేయాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శి మహేందర్‌కు గ్రామస్తులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. తొలుత గ్రామస్తులు ప్లకార్డులతో గ్రామంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. కోళ్లఫాం నిర్మాణాన్ని నిలిపి వేసే వరకు ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూక్య వెంకట్రామ్, ఎంపీటీసీ భూక్య క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

నివాళి



పర్వతగిరి : మండలంలోని వడ్లకొండ గ్రామ బీఆర్‌ఎస్ నాయకుడు జుట్టుకొండ పెద్ద నర్సయ్య, చిన్న నర్సయ్యల సమీప బంధువు శిరంశెట్టి యాకయ్య సోమవారం రాత్రి మృతి చెందగా ఆయన మృతదేహానికి మాజీ జెడ్పీటీసీ, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు మేడిశెట్టి రాములు మంగళవారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆమడగాని రాజుయాదవ్, నాయకులు కరిమిళ్ల దుర్గారావు, బోయినపల్లి స్వామిరావు, దాడి సదానందం, బైరి మహేశ్, జుట్టుకొండ కోటి, పొడిశెట్టి దేవేందర్, కోదాటి వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



రాయపర్తి : మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ కార్యకర్త, మాజీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ ఎర్ర యాకూబ్ కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతుండగా ఆయన్ను ఆ పార్టీ మండల ఎన్నికల ఇన్‌చార్జ్ గుడిపూడి గోపాల్‌రావు ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం పరామర్శించారు. అనారోగ్య కారణాలు అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మండల శ్రీధర్, నాయకులు గుమ్మడిరాజు శ్రీను, కత్తి యాకయ్య, మొర్రి రాజేందర్, అన్వర్, గుండ్లపల్లి రవి, కొత్తపల్లి రఘువరణ్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వాయర్‌పై అక్రమార్కుల కన్ను

- నల్ల రేగడి మట్టి దందాకు కుట్ర

పర్వతగిరి : మండల కేంద్రంలోని పెద్ద చెరువు రిజర్వాయర్‌పై అక్రమార్కుల కన్ను పడిందన్న వ్యాఖ్యలు వినవస్తున్నాయి. రిజర్వాయర్ సమీపంలోని నల్ల రేగడి మట్టిని అమ్ముకుని సొమ్ము చేసుకునే దిశగా కుట్ర జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని బలపర్చేలా పలువురు మట్టి వ్యాపారస్తులు రాజకీయ పార్టీల నాయకుల వద్దకు ప్రదక్షిణలు చేస్తున్నట్లు సమాచారం. అక్రమార్కులు వారం రోజులుగా పర్వతగిరి రిజర్వాయర్‌లో మట్టి తీసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులను కలుస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల భోగట్టా. గతంలోనూ పెద్ద చెరువు రిజర్వాయర్ నుంచి కొందరు కోట్ల రూపాయల విలువైన నల్ల రేగటి మట్టిని తీసి భారీగా సొమ్ము చేసుకున్నట్లు విమర్శలున్నాయి. నల్ల రేగటి మట్టి కాసుల వర్షం కురిపిస్తుండడంతో పర్వతగిరి రిజర్వాయర్ నుంచి ఎలాగైనా మట్టి తీయాలనే ఉద్దేశ్యంతో అక్రమార్కులు పట్టుదలతో ఉన్నట్లు కనపడుతోంది. మైనింగ్, ఇరిగేషన్ శాఖల అనుమతులు లేకుండా అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులను మచ్చిక చేసుకొని మట్టి దందాకు పాల్పడేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి పర్వతగిరి పెద్ద చెరువు రిజర్వాయర్ నుంచి మట్టి అక్రమ తరలింపునకు గురి కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



పెద్ద చెరువు రిజర్వాయర్

ఆర్థిక అక్షరాస్యతతోనే ఉన్నతి

- ఆర్‌బీఐ ఎల్‌డీఓ అలీ బాబా



సమావేశంలో మాట్లాడుతున్న అలీ బాబా

గీసుకొండ : ఆర్థిక అక్షరాస్యత పెంపొందించుకోవడం ద్వారానే జీవితంలో ఉన్నతి సాధించగలరని ఆర్‌బీఐ ఎల్‌డీఓ అలీ బాబా స్పష్టం చేశారు. ఏపీజీవీబీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన అవగాహనా సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకు ఖాతాదారులు తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించే అలవాటు చేసుకోవాలని సూచించారు. ఆర్థిక క్రమశిక్షణను అలవర్చుకుంటే భవిష్యత్‌లో మరిన్ని రుణాలు లభిస్తాయని, ప్రభుత్వ సదుపాయాలు పొందవచ్చని చెప్పారు. బ్యాంకు ద్వారా అమలు అవుతున్న బీమా పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. బీమా చేయించుకున్న ఖాతాదారులు సహజంగా లేదా ప్రమాదవశాత్తు మరణిస్తే బాధిత కుటుంబానికి రూ.2 లక్షలు అందుతుందని చెప్పారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ కాల్స్, మెసేజ్‌లకు స్పందించొద్దని స్పష్టం చేశారు. ఆదాయంలో కొంత భాగాన్ని పొదుపు చేసుకోవడంతోపాటు రుణాలను సకాలంలో తిరిగి చెల్లించడమే ఆర్థిక అక్షరాస్యత అని వివరించారు. కార్యక్రమంలో ఎఫ్‌ఎల్‌సీ కౌన్సిలర్లు ప్రేమ్‌కుమార్, భాస్కరాచారి, బ్యాంకు మేనేజర్ బి.స్వాతి, అకౌంటెంట్ స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రహ్మోత్సవ పూజలు



కల్యాణం నిర్వహిస్తున్న పూజారులు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కమిటీ బాధ్యులు

ఖానాపురం : మండలంలోని బుధరావుపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవ పూజలు మంగళవారం ఘనంగా కొనసాగాయి. రెండ్రోజులపాటు ఏకాదశ వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు తలపెట్టగా భక్తులు హాజరై పూజ చేశారు. మండపారాధన, పూర్ణాహుతి పూజలతోపాటు వెంకటేశ్వరస్వామి కల్యాణ వేడుకను భక్తిశ్రద్ధలతో ఆలయ కమిటీ అధ్యక్షుడు మహలక్ష్మి వెంకటనర్సయ్య, చెడిపాక ఉపేందర్, రాం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను ఊరేగించారు. వేడుకలకు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు, ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు పద్మ, జెడ్పీటీసీ బత్తిని స్వప్న శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీ బిక్కి లింగమ్మ మురళి, తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్స ఉత్సవాల్లో ల్యాదినేని ఎల్లయ్య, ఎలంశెట్టి ప్రసాద్, మోడెం ఎల్లగౌడ్, పసునూరి వెంకటేశ్వర్లు, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా హనుమత్ హోమం



దుగ్గొండి : మండలంలోని నాచినపల్లిలోని రామాలయంలో సామూహిక హనుమత్ హోమాన్ని మంగళవారం వేడుకగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి హనుమాన్ మాలదారులు భారీ సంఖ్యలో తరలివచ్చి హోమంలో పాల్గొని పూజించారు. అనంతరం గ్రామ ప్రధాన వీధుల మీదుగా హనుమాన్ భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు రమేశ్‌మూర్తి, నాగేందర్‌స్వామి, ప్రముఖ శిల్పి మట్ట రాజు, పుట్టపాక రాజేందర్, రాము, లక్ష్మణ్, సాంబయ్య, కుమారస్వామి, మహేందర్, కొమ్మెర రాజు, నరేశ్ పాల్గొన్నారు.

సాగులో సేంద్రియ విధానమే మేలు



మాట్లాడుతున్న పీయూ మేనేజర్ హిమవర్షిణి

పర్వతగిరి : సేంద్రియ విధానంలో పంటలు సాగు చేయడమే మేలని పీయూ మేనేజర్ హిమవర్షిణి తెలిపారు. నేల పునరుత్పాదక వ్యవసాయ విధానంలో భాగంగా మండలంలోని నారాయణపురంలో ప్రజ్వల్ ఎఫ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో రైతులకు మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పంటల సాగులో రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. రైతులు నేల ఆరోగ్యం, జీవ వైవిధ్యం, సుస్థిరతకు ప్రాధాన్యతను ఇచ్చే వ్యవసాయ విధానం కలిగి ఉండాలని చెప్పారు. రైతులు నవధాన్యాలు పంట పొలాల్లో పచ్చి రొట్టె ఎరువులుగా వేసుకోవాలని తెలిపారు. వర్మి కంపోస్టు, సిటి కంపోస్టు, చెరువు మట్టి, పెంట మట్టి వేసుకుంటే భూసారం పెరుగుతుందని, భవిష్యత్ తరాలకు నాణ్యమైన భూమిని అందించగలమని వివరించారు. సేంద్రీయ విధానంలో రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గి అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యకర్తలు సైకిలాబ్‌బాబు, వెంకటలక్ష్మి, కోమల, మౌలిక తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో భారీ చోరీ



విచారణ చేస్తున్న సీఐ సూర్యప్రకాశ్

రాయపర్తి (వర్ధన్నపేట) : తాళం వేసి ఉన్న ఇంట్లో భారీ చోరీ జరిగిన ఘటన వర్ధన్నపేటలో మంగళవారం చోటు చేసుకుంది. దొంగలు బంగారం, వెండి ఆభరణాలు, వస్తువులతోపాటు నగదును చోరీ చేశారు. ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. వర్ధన్నపేటకు చెందిన గుజ్జ ఆనందరావు భార్య శోభారాణి, చిన్న కూతురు శృతితో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్న పెద్ద కూతురు పల్లెపాటి సృజన ఇంటికి సోమవారం (ఈనెల 27)న వెళ్లారు. ఈ క్రమంలో దొంగలు తాళానికి ఉన్న స్క్రూలను తొలగించి ఇంట్లోకి చొరబడి బీరువా తాళాలు తీసి 10 గ్రాముల 3 జతల కమ్మలు, 20 గ్రాముల 4 రింగులు, రెండు వెండి బిల్లలు, 20 గ్రాముల వెండి మంగళహారతి ప్లేట్లుతోపాటు నగదు చోరీ చేశారు. మొత్తం రూ.1.95 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, వస్తువులతోపాటు నగదు చోరీకి గురైంది. ఆనందరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఘటనా స్థలిని సీఐ సూర్యప్రకాశ్ సందర్శించి విచారణ చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ శోభాయాత్ర



రాయపర్తి : శోభాయాత్రలో హనుమాన్ భక్తులు



గీసుకొండ : ధర్మారంలో..

రాయపర్తి (వర్ధన్నపేట): వర్ధన్నపేటలో హనుమాన్ భక్తులు మంగళవారం భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర నిర్వహించారు. హనుమాన్ భక్తిపాటలతో పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. హనుమాన్ భక్తుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. పట్టణంలో సందడి నెలకొంది.

ధర్మారంలో..

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ పరిధిలోని ధర్మారంలో హనుమాన్ భక్తులు ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు. రామలింగేశ్వరస్వామి ఆలయం నుంచి యాత్ర కొనసాగింది. 'జై హనుమాన్.. జై శ్రీరాం..' నినాదాలతో హోరెత్తించారు.

మారెమ్మకు బోనాలు

రాయపర్తి : మండలంలోని పెర్కవేడులో దళిత కులస్తులు మారెమ్మకు మంగళవారం భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆ కుల పెద్దలు గారె బ్రహ్మయ్య, గారె నాగరాజు మాట్లాడారు. పదేళ్లుగా మారెమ్మ పండగ నిర్వహించలేదని చెప్పారు. ఈ క్రమంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బోనాలు సమర్పించడంతోపాటు ప్రత్యేక మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ఐత మల్లయ్య, వేల్పుల యాకయ్య, గారె చిన్న సాయిలు, గారె శుభాకర్, గారె రాజు, తాటికాయల రవీందర్, సైదులు, వీరస్వామి, గద్దర్ సాయిలు, ఐత వెంకన్న, తాటికాయల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఊర చెరువు శిఖం భూములను కాపాడండి



మాట్లాడుతున్న వెంకన్న

చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేట ఊర చెరువు శిఖం భూములు అక్రమణ నుంచి కాపాడాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర నాయకుడు, ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి కన్నం వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ చెరువు శిఖం భూమిని ఆయన ఆధ్వర్యంలోని బృందం మంగళవారం సందర్శించింది. అనంతరం నాయకులు, రైతులతో కలిసి వెంకన్న మాట్లాడారు. చెరువు శిఖం భూమి సుమారు 121 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా నానాటికీ కబ్జాకు గురౌతోందని చెప్పారు. అయినా రెవెన్యూ, నీటి పారుదల శాఖల అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి చెరువు శిఖం భూమికి హద్దులు ఏర్పాటు చేయడంతోపాటు ఆక్రమణకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు బండి రమేశ్, కాంగ్రెస్ నాయకులు అబ్బదాసి సుధాకర్, అలువాల యాకయ్య, అలువాల అశోక్, కన్నం సారయ్య, అలువాల సుధాకర్, బొక్కల రజిని, బొక్కల పూలమ్మ, అలువాల పూలమ్మ, తిక్క వీరమ్మ, అలువాల సుధ, కన్నం మరియమ్మ, కన్నం శోభ, కన్నం శ్రీలత, కన్నం సందీప్, బత్తిని సాంబయ్య పాల్గొన్నారు.

సొసైటీ కార్యాలయంలో జీలుగ విత్తనాలు

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని స్థానిక సొసైటీ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణరెడ్డి తెలిపారు. సొసైటీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ పంటల కాలానికి అనుగుణంగా రైతులకు సరిపడా జీలుగా విత్తనాలు ఉన్నాయని తెలిపారు. జీలుగ విత్తనాలు అవసరం ఉన్న రైతులు పట్టా పాస్ బుక్, అధార్ కార్డు జిరాక్స్‌లు తీసుకొని సొసైటీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. రైతులు జీలుగ విత్తనాలను వినియోగించుకోవాలని కోరారు.

జనాభా మేరకు రిజర్వేషన్లు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న జి.రాజు

నర్సంపేట : జనాభా మేరకు బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించాలని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గురుమిళ్ల రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని కుమ్మరికుంటలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్య, ఉద్యోగ, ఉపాధి, ఇతర రంగాల్లో వాటా, సంక్షేమ పథకాల అమలు కోసం ఆయా కులాల ఆర్థిక, సామాజిక, రాజకీయ వెనుకబాటుతనాన్ని శాస్త్రీయంగా లెక్కించాల్సి ఉందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఎస్సీ, ఎస్టీలకు జనాభా ప్రకారమే రిజర్వేషన్ అమలవుతుండగా బీసీలకు అమలు కావడం లేదన్నారు. రాష్ట్రంలో 12 వేల 769 గ్రామాలు ఉన్నాయని, స్థానిక స్వపరిపాలనలో అన్ని కులాల ప్రాతినిధ్యం ఉండాలంటే కులాల వారిగా జనాభా లెక్కించి ఆ మేరకు వాటాఆ నిర్ణయించాలని ఆకాంక్షించారు. అలా కాకుండా పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించి రిజర్వేషన్లు కేటాయిస్తే బీసీలకు అన్యాయం జరుగుతుందని ఆందోళన వెలిబుచ్చారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ గతంలో హామీ ఇచ్చిందన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో కులగణన ఆలస్యమయ్యే అవకాశం ఉన్న క్రమంలో గత ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా బీసీలకు స్థానిక సంస్థల్లో 52 శాతం రిజర్వేషన్లు కల్పించి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సావిత్రిబాయి పూలే మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గన్నారపు సరోజన, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.చక్రవర్తి, రాష్ట్ర సహాయ కార్యదర్శి గోవిందు, హనుమకొండ జిల్లా కన్వీనర్ తంపుల మొగిలి, నాయకులు చైతన్య భారతి, సైదమ్మ, బత్తుల విజయ, తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ మేరకు బీసీలకు..

విద్య, ఉద్యోగాల్లో బీసీలకు ఏబీసీడీ వర్గీకరణ మేరకు నియామకాల తరహాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ అమలు చేయాలని మేదరి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శేర్ల శ్రీనివాస్ డిమాండ్ కోరారు. పట్టణంలో మీడియాతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో దాదాపు 130 బీసీ కులాలుండగా అందులో కేవలం 5, 6 కులాలు మాత్రమే మొత్తం రిజర్వేషన్ పొందుతున్నట్లు తెలిపారు. సంచార, వృత్తిపై ఆధారపడ్డ కులాలు కనీసం వార్డు మెంబర్, సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ పదవులు పొందలేని దుస్థితి నెలకొందని ఆందోళన వెలిబుచ్చారు. ఇకనైనా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏబీసీడీ వర్గీకరణపై నిర్ణయం తీసుకున్నాకే ముందుకు సాగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యుత్ సౌకర్యం కల్పించాలి

నర్సంపేట : పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌లోని సర్వే నంబర్ 111లోని ప్రభుత్వ భూమిలోని గుడిసెలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని గుడిసెవాసులు ప్రభుత్వాన్ని కోరారు. గుడిసెవాసులు మీడియాతో మంగళవారం మాట్లాడారు. డీబీఆర్పీ ఆధ్వర్యంలో పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు గుడిసెలు వేసుకుని 16 నెలలుగా నివాసం ఉంటున్నట్లు తెలిపారు. తమకు విద్యుత్ సౌకర్యం లేక ఇబ్బందులకు గురవుతున్నట్లు చెప్పారు. జూలూరి లచ్చమ్మ గతంలో భూమి వారిదంటే బనాయించిన కేసులపై హామీ మేరకు అధికారులు వెంటనే సర్వే చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అల్లం రాజక్క, గండికోట సమ్మక్క, మిట్టకడుపుల రజిత, భువనగిరి సుజాత, జన్ను మానస, బొక్కల అరుణ, గిరబోయిన నర్సమ్మ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలి



వినతిపత్రం ఇస్తున్న భద్రయ్య, నాయకులు

చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేటలో పెద్దమ్మ తల్లి ఆలయానికి స్థలం కేటాయించి నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని స్థానిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు హంస భద్రయ్య, మాజీ అధ్యక్షులు ఉప్పరి వీరస్వామి, ఉప్పరి కొంరయ్య, ముదిరాజ్ కుల పెద్ద ఉప్పరి చిన్న నర్సింహస్వామి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు వారు ఆర్డీఓను, తహసీల్దార్‌ను మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం భద్రయ్య మాట్లాడారు. పాపయ్యపేటలోని సర్వే నంబర్ 135, 136ల్లోని ఊర చెరువు శిఖం భూమి అక్రమణకు గురికాకుండా హద్దులు ఏర్పాటు చేయడంతోపాటు సర్వే నంబర్ 136లోని అన్యాక్రాంతమవుతున్న 1.6 ఎకరాల ప్రభుత్వ భూమిని పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి సహకార సంఘం తరఫున నిర్ణయించుకుని మట్టి పోసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ముత్యాల రాంబాబు, ఎదెరబోయిన ఉప్పలయ్య, అన్నెబోయిన సునీల్, నూనె రమేశ్, ఉప్పరి నర్సింహస్వామి, సారంగం, గొడుగు శ్రీనివాస్, చెన్నూరి రవి, సాంబయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దుక్కిటెద్దులకు గాయాలు

రాయపర్తి (వర్ధన్నపేట) : టాటా ఏసీ వాహనం ఢీకొని రెండు దెక్కిటెద్దులకు తీవ్ర గాయాలైన ఘటన వర్ధన్నపేట శివారులో మంగళవారం చోటు చేసుకుంది. వర్ధన్నపేటకు చెందిన జాటోతు దశరథం సాకుతున్న రెండు దుక్కిటెద్దులు రోడ్డు దాటుతుండగా టాటా ఏసీ వాహనం ఢీకొట్టింది. వాహనదారుపై చట్టరీత్యా చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని దశరథం కోరుతున్నాడు.

'మాస్టర్ మైండ్'పై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందిస్తున్న నరేశ్, నాయకులు

నర్సంపేట రూరల్ : ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తున్న క్రమంలో పట్టణంలోని మాస్టర్ మైండ్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం మండల రిసోర్స్ సెంటర్‌లో అధికారికి మంగళవారం వినతిపత్రం అందజేసింది. అనంతరం నరేశ్ మాట్లాడారు. మాంటిసోరి పాఠశాల పేరుతో అనుమతి తీసుకుని ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మాస్టర్ మైండ్ స్కూల్ పేరుతో వివిధ గ్రామాల్లో ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేసి ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం, విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి పాఠశాల తీరుపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతం సిద్దు, నాయకులు ప్రశాంత్, వినయ్, శ్రీకాంత్, ప్రమోద్, రఘు, వినీత్, ఉదయ్ పాల్గొన్నారు.

నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు



విత్తన దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏఓ దయాకర్

దుగ్గొండి : రైతులకు నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏఓ దయాకర్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని పలు విత్తన దుకాణాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. దుకాణాల్లో ఏయే రకాల విత్తనాల స్టాకు ఎంత ఉంది?, విక్రయించింది ఎంత? రశీదులు ఇచ్చారా, తదితర విషయాలపై విచారణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈఓ హనుమంతు, డీలర్లు పాల్గొన్నారు.

నేడు సప్తశతి చండీ హోమం

దామెర : నేడు (బుధవారం) సప్తశతి చండీ హోమాన్ని నిర్వహించనున్నట్లు హనుమాన్ ఆలయ చైర్మన్ పోలం కృపాకర్‌రెడ్డి తెలిపారు. వైశాఖ వార్షికోత్సవం సందర్భంగా హోమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 6 గంటలకు శాంతి మంత్రము, మహాగణాధిపతి పూజ, స్వస్తి పుణ్యాహవాచనము, రక్షాబంధనము, అభయాంజనేయ స్వామి పంచామృతాల అభిషేకం నిర్వహిస్తామన్నారు. ఉదయం 9 గంటలకు లక్ష్మీగణపతి, చండీ హోమం ఉంటుందని తెలిపారు.

కేసు నమోదు

సంగెం : మండలంలోని కాట్రపల్లికి చెందిన కర్ర అమరేందర్‌రెడ్డికి చెందిన రెండెకరాల అరటితోట దగ్ధానికి కారణమైన కర్ర రాంరెడ్డిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై నరేశ్ తెలిపారు. రాంరెడ్డి అతడి మొక్కజొన్న చొప్పకు నిప్పు పెట్టగా పక్కనే ఉన్న అమరేందర్‌రెడ్డికి చెందిన అరటితోట అంటుకుని దగ్ధమైంది. పాత కక్షలను దృష్టిలో పెట్టుకుని అరటి తోటకు నిప్పంటుకున్న సమాచారం కూడా తనకు ఇవ్వలేదని, సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని తెలుపుతూ అమరేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

అట్రాసిటి కేసుపై ఏసీపీ విచారణ

ఐనవోలు : మండలంలోని పంథిని గ్రామానికి చెందిన వ్యక్తిపై అట్రాసిటి కేసు నమోదైంది. ఈ క్రమంలో మంగళవారం ఏసీపీ తిరుపతి పంథినిలో విచారణ చేపట్టారు. ఎస్సై గైకడి అనిల్ కుమార్ వివరాలు వెల్లడించారు. వరంగల్ జిల్లా గిర్మాజీపేటకు చెందిన బుట్టి రంజిత్ ఫిర్యాదు మేరకు పంథిని గ్రామానికి చెందిన వ్యక్తిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు.